క్లుప్తంగా

పార్కుల్లో పిల్లల ఆటవిడుపు



పార్కులో ఓపెన్ జిమ్‌లో చిన్నారుల సందడి

మద్దిలపాలెం: వేసవి సెలవుల్లో చిన్నారులు కాసేపు ఆటవిడుపు కోసం పార్కుల బాట పడుతున్నారు. సాయంత్రం వేళల్లో చిన్నారులతో పార్కులు కళకళలాడుతున్నాయి. ఆటలాడుతూ సందడి చేస్తున్నారు. ఓపెన్ జిమ్‌లో ఏర్పాటు చేసిన పరికరాలతో కసరత్తులు చేస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. చిన్నారులతో వారి తల్లిదండ్రులు పార్కులు వాకింగ్, జాగింగ్, జిమ్ పరికాలతో కాసేపు శారీక వ్యాయమం చేస్తూ కనిపిస్తున్నారు. పార్కుల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో రాత్రి 8 గంటల వరకూ సందడిగా ఉంటున్నాయి.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడి మృతి



వృద్ధుడి మృతదేహం

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో కొద్ది రోజుల క్రితం అస్వస్థతకు గురైన ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన బంధువులు ఎవరైనా ఉంటే సంప్రదించాలని పోలీసులు కోరారు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత నెల 6న సుమారు 70 సంవత్సరాల వయసు గల ఓ వృద్ధుడు బీఆర్‌టీఎస్ పక్కన పినాకిల్ ఆస్పత్రి సమీపంలో అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన స్థానిక మహిళ అంబులెన్స్‌కు ఫోన్ చేసి కేజీహెచ్‌లో చేర్పించారు. ఆ వృద్ధుడు అప్పటి నుంచి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. ఆధారాలు ఏమీ లభించకపోవడంతో గుర్తు తెలియని మృతిగా పోలీసుల కేసు నమోదు చేశారు. బంధువులు ఎవరైనా ఉంటే వెంటనే ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.


కూచిపూడిలో సత్తా చాటిన ప్రణవి



క్లాన్‌క్లేవ్-2024లో విజేతగా నిలిచిన ప్రణవి

దాబాగార్డెన్స్ : నగరానికి చెందిన చిన్నారి పినిశెట్టి ప్రణవి కూచిపూడి నృత్యంలో అద్భుత ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచింది. ఇటీవల అంతర్జాతీయ స్థాయిలో థాయిల్యాండ్‌లోని అలెయన్స్ ప్రావిన్స్‌లో జరిగిన కల్చరల్ క్లాన్‌క్లేవ్-2024లో కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి విజేతగా నిలిచింది. ఇప్పటికే ఎన్నో అవార్డులు, పతకాలు సాధించిన ఈ చిన్నారి భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు గెలవాలని గురువు కూచిపూడి నాగచందన ఆకాంక్షించారు. ఆరేళ్ల వయస్సు నుంచి ప్రణవి కూచిపూడి నృత్యం చేస్తూ మంచి ప్రదర్శనలు ఇచ్చిందంటూ చిన్నారి తల్లిదండ్రులు పినిశెట్టి రమేష్ బాబు, నవ్యను పలువురు అభినందించారు.

19న కుంతీ మాధవ స్వామి చందనోత్సవం




కుంతీ మాధవ స్వామి విగ్రహం

పద్మనాభం : పద్మనాభం లోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో స్వామి చందనోత్సవం ఈ నెల 19న నిర్వహించనున్నట్టు ఈవో నానాజీ బాబు తెలిపారు. 18న రాత్రి పది గంటలకు కుంతీ మాధవ స్వామి విగ్రహాన్ని చందనంతో అలంకరిస్తారు. 19న ఉదయం ఆరు గంటల నుంచి చందనం అలంకరణలో ఉన్న కుంతీ మాధవ స్వామిని దర్శించుకోవడానికి భక్తులకు ప్రవేశం కల్పిస్తారు.

బెట్టింగ్ బంగార్రాజులు

- తూర్పులో జోరుగా పందేలు
- రూ.కోట్లకు చేరుకున్న జూదం



నియోజకవర్గంలో భాగం



ఆరిలోవ: 'మా పార్టీ అభ్యర్థి గెలుస్తాడు.. మా పార్టీ అభ్యర్థి మెజారిటీ ఇంత.. మీ పందెం రూ.లక్ష.. మాది రూ.70 వేలు'అంటూ ఇప్పుడు తూర్పు నియోజకవర్గంలో పందేల జోరు హోరెత్తుతోంది. ఎన్నికల పోలింగ్ ముగియడంతో బెట్టింగ్ రాయుళ్లకు పండగలా ఉంది. నగటున రూ.లక్షలు పందెం కాస్తుండగా.. మొత్తంగా కలిపి రూ.కోట్లకు చేరినట్లు తెలుస్తోంది. వివిధ పార్టీల అభ్యర్థులు విజయం సాధిస్తారని..అదే సమయంలో వారికి వచ్చే మెజారిటీపై కూడా పందేలు నడుస్తున్నాయి. ప్రస్తుతానికి ఎన్నికల ఫలితాలకు దాదాపు 20 రోజులు సమయం ఉన్నందున ప్రాథమికంగా రూ.లక్షల్లో పందేలు కడుతున్నారు. ఫలితాల రోజు దగ్గర పడుతున్న కొద్దీ బెట్టింగ్‌లు ఘననీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. పొలిటికల్ బెట్టింగ్ విషయంలో పందెంరాయుళ్లు సర్వేలను కూడా ఆధారం చేసుకుంటున్నారు. మొత్తానికి రానున్న మూడు వారాల పాటు బెట్టింగ్ వ్యవహారం జోరుగా సాగనుంది.

సుమారు రెండు నెలలుగా తూర్పులో అసెంబ్లీ అభ్యర్థుల తరఫున అనుచరులు చేసిన హడావిడి అంతాఇంతా కాదు. ఈ నెల 13న జరిగిన పోలింగ్‌తో ప్రచారాలకు బ్రేక్ పడింది. ఇప్పుడు బెట్టింగ్ హడావిడి నెలకొంది. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులపై పందేల జోరుకు తెరతీశారు. ఆయా పార్టీల నాయకులు రూ.లక్షల్లో పందేలు కాస్తున్నారు. పోలింగ్ బాగా జరిగిందని, ప్రజలు మా పార్టీకే ఎక్కువ ఓట్లు వేశారని ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ ధీమాతో రూ.లక్షలు పందేలు కాస్తున్నారు.

పందేలకు మధ్యవర్తిత్వం

వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వెలగపూడి మళ్లీ నాలుగోసారి కూడా గెలవడం కాయమంటూ టీడీపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు అందుకుంటున్న వారంతా వైఎస్సార్‌సీపీకే ఓటు వేశారని, అందుకే ఎంవీవీ సత్యనారాయణ ఈసారి ఎమ్మెల్యేగా గెలవబోతున్నారంటూ ఆ పార్టీ నాయకులు ధీమాతో ఉన్నారు. అందుకే ఎవరికి వారు మా అభ్యర్థి గెలుస్తారు అంటే, మా అభ్యర్థే గెలుస్తారని పందేలకు దిగుతున్నారు. ఈ పందేలపై మధ్యవర్తుల సమక్షంలో అగ్రిమెంట్లు రాయించుకుంటున్నారు. పందేలు కాసిన ఇరువురి డబ్బులు ఆ మధ్యవర్తుల వద్ద భద్రపరుస్తున్నారు. కౌంటింగ్ పూర్తయిన వెంటనే గెలిచిన అభ్యర్థి తరఫున పందెం కాసిన వ్యక్తికి ఆ డబ్బులు ఇచ్చేస్తారు. మధ్యవర్తుల్లగా వ్యవహరించినందుకు ఓడిపోయిన వ్యక్తి డబ్బుల్లో 5 శాతం వారు తీసుకొనే విధంగా అగ్రిమెంట్‌లో ముందుగా రాయించుకుంటున్నారు. ఈ పందేల సందడి ఆరిలోవ, మద్దిలపాలెం, ఎంవీపీ కాలనీ, పెదవాల్తేరు ప్రాంతాలలో ఎక్కువగా కనిపిస్తోంది. ఇదిలా ఉండగా మితిమీరిన ధీమాతో కొందరు అప్పులు చేసి పందేలు కాస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఆ అప్పులకు కోసం సొంత ఇంటి పత్రాలు షూరిటీగా పెడుతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. పార్టీల అభ్యర్థులపై ఉన్న మితిమీరిన అభిమానం వారికి చేటు చేస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. 2019లో పందేలకు దిగి రూ.లక్షల్లో నష్టపోయినవారు ఇప్పటికీ కోలుకోలేక పోతున్నారని, చాలా మంది అప్పులు పాలయ్యారని గతాన్ని గుర్తు చేస్తున్నారు. ఇలాంటివాటికి దూరంగా ఉండటం ఉత్తమని పందెంరాయుళ్లకు పలువురు సూచిస్తున్నారు. ఈ మాయా జూదానికి పోలీసులు కూడా అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

22, 23 తేదీల్లో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని ఈ నెల 22, 23వ తేదీల్లో విశాఖపట్నం వేదికగా నిర్వహించనున్నారు. ఈ మేరకు పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో కలిసి నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ కార్యదర్శి డాక్టర్ బి.బాలాజీ ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ బాలాజీ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో వేడుకలను నిర్వహిస్తామన్నారు. ఈ నెల 22న బీచ్ రోడ్డులో ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో సదస్సు, ఎగ్జిబిషన్ నిర్వహిస్తామని తెలిపారు. 23న కూడా ఎగ్జిబిషన్ కొనసాగుతుందని, 23న జాతీయ సదస్సును ఏయూ వృక్షశాస్త్ర విభాగంలో జరుగుతుందన్నారు. ప్రతి వ్యక్తి జీవితంతో జీవ వైవిధ్యత ముడిపడి ఉందన్నారు. ప్రతీ వ్యక్తిని భాగస్వాములను చేస్తూ జీవవైవిధ్య పరిరక్షణ దిశగా పనిచేస్తామన్నారు. ఏపీ బయోడైవర్సిటీ బోర్డ్ మెంబర్ సెక్రటరీ బి.వి.ఎ.కృష్ణమూర్తి మాట్లాడుతూ జీవవైవిధ్య పరిరక్షణ దిశగా చేసే కార్యక్రమాలకు తాము సహకారం అందిస్తామన్నారు. సంరక్షణ, పరిశోధన, అధ్యయన రంగాలకు ఉపయుక్తంగా వర్సిటీలో జీవవైవిధ్యతను పరిరక్షించాలని సూచించారు.

ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మాట్లాడుతూ బయో డైవర్సిటీ పార్కును ఏయూలో ఏర్పాటు చేస్తామన్నారు. దీని కోసం ప్రత్యేకంగా స్థలాన్ని సైతం గుర్తించామన్నారు. ఏయూ వేదికగా వెయ్యి స్టార్టప్ సంస్థలు పనిచేయడం లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. ఏయూ టెక్ హబ్‌లో ఇప్పటికే 172 సంస్థలు పని చేస్తున్నాయన్నారు. విదేశీ విద్యార్థుల సంఖ్య వెయ్యి మార్కును దాటిందన్నారు. ఏయూ నలుమూలలా ఏర్పాటు చేసిన స్టార్టప్ కేంద్రాలు టెక్, ఫార్మా, ఫుడ్ సైన్స్, ఆక్వా రంగాలకు అవసరమైన సేవలు అందిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, వృక్షశాస్త్ర విభాగాధిపతి ఆచార్య సంధ్య దీపిక, ఆచార్య ఎస్.బి.పడాల్, రత్నకుమార్, బలరాం పడాల్, డాక్టర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్‌కు ఎంపికైన నరేంద్ర పడాల్‌కు సత్కారం



నరేంద్ర పడాల్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, సంఘం నాయకులు తదితరులు

ఎంవీపీ కాలనీ: ఇటీవల విడుదలైన యూపీఎస్సీ ఫలితాల్లో విజయం సాధించిన చిట్టపులి నరేంద్ర పడాల్‌ను అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. ఎంవీపీ కాలనీలోని గిరిజన భవన్‌లో బుధవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, సంఘం జిల్లా నాయకులు, స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తదితరులు నరేంద్ర పడాల్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూపీఎస్సీ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో నరేంద్ర పడాల్ 2023 ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. ఆయన స్ఫూర్తితో మరింత మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు దిశగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు, కార్యదర్శి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

టీటీడీకి రూ.10 లక్షల విరాళం



ఈవో ధర్మారెడ్డికి రూ.10 లక్షల చెక్కు అందజేస్తున్న దాత

ఎంవీపీ కాలనీ : నగరానికి చెందిన ఆధ్యాత్మికవేత్త, విశాఖ సాగరతీర కార్తీక దీపోత్సవం కమిటీ ప్రతినిధి హిమాన్షు ప్రసాద్ కుటుంబం తిరుమల తిరుపతి దేవస్థానానికి రూ.10 లక్షల విరాళం అందజేసింది. ఈ మేరకు బుధవారం హిమాన్షు ప్రసాద్ టీటీడీ ఈవో ధర్మారెడ్డిని తిరుపతిలో కలిసి చెక్కును అందజేశారు. ఎస్వీబీసీ భక్తి ఛానల్ ద్వారా మరిన్ని మెరుగైన కార్యక్రమాల నిర్వహణకు ఈ నిధులను కేటాయించాలని ధర్మారెడ్డిని కోరారు. ఈ సందర్భంగా ప్రసాద్‌ను ఈవో అభినందించారు.

కోదండ రాముడి పుష్పయాగానికి పూలు తరలింపు



పుష్పయాగానికి తరలించే పూలను ప్రదర్శిస్తున్న దృశ్యం

ఎంవీపీ కాలనీ: తిరుపతి శ్రీకోదండ రాముడి పుష్పయాగానికి విశాఖ నుంచి పూలు తరలివెళ్లాయి. ఆధ్మాతిక వేత్త హిమాంశు ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లాలలోని వివిధ ప్రాంతాలలో సేకరించిన పూలును బుధవారం ఎంవీపీలోని టీటీడీ ఈ-దర్శనం కౌంటర్ వద్ద భక్తుల సందర్శనార్థం ప్రదర్శించారు. తిరుమలలో ఉత్సవాల్లో భాగంగా జరిగే పుష్పయాగానికి ఈ పూలు తరలిస్తున్నట్లు హిమాంశు ప్రసాద్ తెలిపారు. కలువలు, తామరలు, తులసి, మల్లి ఇలా వివిధ రకాలకు చెందిన 15 వేల పూలను సేకరించామన్నారు. ఈ పూలకు సంకల్పం చేసి అనంతరం బుధవారం సాయంత్రం తిరుమల తరలించామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎంవీపీ వాసులు భక్తులు పాల్గొన్నారు.

రోడ్డుపై యథేచ్ఛగా పార్కింగ్



శ్రీకాంత్‌నగర్ గెడ్డ అంచున జీవీఎంసీ ఏర్పాటు చేసిన కంచె పక్కన రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలు

ఆరిలోవ: జీవీఎంసీ అధికారులు గెడ్డలు ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపడుతున్నారు. అలాగే గెడ్డల అంచున పచ్చదనం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆరిలోవ ప్రాంతం శ్రీకాంత్‌నగర్ వద్ద గెడ్డకు రోడ్డుకు మధ్య ఇనుప కంచె ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికి సుమారు సగానికి పైగా పనులు పూర్తయ్యాయి. గెడ్డ అంచులు ఆక్రమణ గురికాకుండా, బడ్డీలు ఏర్పాటు చేయకుండా ఇక్కడ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు జీవీఎంసీ అధికారులు ప్రకటించారు. ఇదిలా ఉండగా కంచె వేసినా మమ్మల్ని ఎవరూ ఆపలేరు అన్నట్లు ట్రావెల్స్ బస్సులు, తదితర వాహనాలను కొందరు కంచె పక్కన రోడ్డుపై యథేచ్ఛగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రోడ్డుకు సగ భాగం ఈ వాహనాలతో నిండిపోతోంది. వాహనాల పార్కింగ్‌తో ఆ మార్గంలో రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ వాహనాలు పార్కింగ్ చేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

డెంగ్యూ అవగాహన ర్యాలీ నేడు

మద్దిలపాలెం : ప్రపంచ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జీవీఎంసీ కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ ర్యాలీలో జీవీఎంసీ, జిల్లా మలేరియా విభాగాల సిబ్బంది పాల్గొని జయప్రదం చేయాలని అధికారులు కోరారు. డెంగ్యూ ప్రభలడానికి కారణమైన దోమలపై అవగాహనతో పాటు వాటి నివారణ, డెంగ్యూ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ర్యాలీలో వివరిస్తామని తెలిపారు.

కల్యాణ వైభోగం



పాల్గొన్న ఉభయదాతలు



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

నిరంతర అన్నదాన సేవలకు రెండేళ్లు

- ధ్యాన మందిరంలో కమ్యూనిటీ ఫ్రిడ్జ్‌ల ద్వారా ఆహారం పంపిణీ




కమ్యూనిటీ ఫ్రిడ్జ్‌లో భద్రపరచిన ఆహారాన్ని అన్నార్తులకు అందిస్తున్న నూకల శేషగిరిరావు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో నిరంతర అన్నదానం కోసం ఏర్పాటు చేసిన కమ్యూనిటీ ఫ్రిజ్‌లకు రెండేళ్లు పూర్తయ్యాయి. ధ్యాన మందిరంలో కొన్నేళ్లుగా నిరాటంకంగా కొనసాగుతున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి మరింత ప్రోత్సాహమిచ్చేలా ఇంటర్నేషనల్ వైశ్ ఫెడరేషన్ సహకారంతో 2022 మే 16న రెండు కమ్యూనిటీ ఫ్రిడ్జ్‌లు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం జరుగుతున్న అన్నదానంలో పాల్గొంటున్న వారికి అదనంగా 24 గంటలు ఏ సమయంలోనైనా ఆకలితో ఉన్నవారు ఈ ఫ్రిడ్జ్‌ల్లో నుంచి ఆహారం తీసుకోవచ్చు. ప్రతి రోజు వీటిలో ఆహారాన్ని ప్యాకెట్ల రూపంలో భద్రపరుస్తున్నారు. రెండేళ్లుగా ప్రతి రోజు కనీసం 50 నుంచి 100 మంది ఆకలిని తీర్చగలిగినందుకు తమకెంతో సంతోషంగా ఉందని ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు తెలిపారు.

బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలకు వేళాయెె

- నేడు ఉత్సవాలకు అంకురార్పణ
- ముస్తాబైన పెందుర్తి వెంకటాద్రి





పెందుర్తి: బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలకు పెందుర్తి వెంకటాద్రి సిద్ధమైంది. శ్రీనివాసుడు పద్మావతి అమ్మవారిని వివాహమాడేందుకు భూమి మీద అడుగిడిన పవిత్ర రోజు వైశాఖ శుద్ధ దశమి నాడు ఏటా బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. పెందుర్తి వెంకటాద్రి నిర్మాణానికి కూడా వైశాఖ శుద్ధ దశమి నాడే తొలి అడుగు పడింది. ఈ క్రమంలో ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహించి వెంకటాద్రిపై వైశాఖ శుద్ధ దశమి(శనివారం) నాడు కల్యాణం చేస్తారు. ఈ క్రమంలో వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఐదు రోజులపాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు విష్వక్సేనపూజ, అంకురార్పణ జరుగుతుంది. రెండో రోజు శుక్రవారం ఉదయం ధ్వజారోహణ, హోమాలు చేస్తారు. సాయంత్రం లక్ష తులసి, మల్లికా పుష్పాలతో స్వామివారికి విశేష అర్చనలు జరుగుతాయి. మూడోరోజు శనివారం వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా సాయంత్రం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. నాలుగో రోజు ఆదివారం సాయంత్రం తిరువీధి ఉత్సవంలో భాగంగా స్వామివారి రథోత్సవం సాగనుంది. వెంకటాద్రి నుంచి పెందుర్తి పురవీధుల్లో స్వామివారు రథంపై పయనిస్తూ చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధి వరకు భక్తులకు ఆశీసులు అందిస్తారు. ఆఖరి రోజు సోమవారం ఉదయం స్వామివారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానమాచరిస్తారు. సాయంత్రం పుష్పయాగం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, స్వామివారికి విశేష అర్చనలు, ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రతినిధులు వెల్లడించారు. భక్తులంతా తరలిరావాలని కోరారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వెంకటాద్రిపై ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వీరభద్ర విజయం.. విశిష్ట కావ్యం




మాట్లాడుతున్న ఆచార్య అయ్యగారి సీతారత్నం

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో బుధవారం 'పోతన వీరభద్ర విజయం' అనే అంశంపై ఆంధ్రా యూనివర్సిటీ ఆచార్యులు డాక్టర్ అయ్యగారి సీతారత్నం ప్రసంగం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోతన వీరభద్ర విజయం భాగవతానికి ముందే రాశారని ఆరుద్ర నిరూపించారన్నారు. పోతన ఈశ్వర భక్తి ఈ కావ్యంగా స్పష్టమవుతుందని, అనంతర కాలంలో భాగవతం రాసేటప్పటికీ ఏకేశవరో పాసన హరిహర అభేదం తెలుస్తుందన్నారు. వీరభద్ర విజయంలోని పద్యాలను పరిశీలిస్తే పోతన శైలి, శబ్దాలంకార ప్రీతి సుస్పష్టమవుతుందన్నారు. లాటానుప్రాసం, వృత్యానుప్రాసం అద్భుతంగా ప్రయోగించారని చెప్పారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ వీరభద్ర విజయం మంచి కవిత్వ పటుత్వంతో రాసిన కావ్యమని తెలిపారు. దీని మూలం వాయు పురాణంలోనిదన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ పోతన రాసిన వీరభద్ర విజయం శైవమత ప్రధాన మైనదని, శివుడి జటాజూటం నుంచి ఉద్భవించిన వీరభద్రుడు, దక్షుని సంహరించుట ప్రధాన ఇతివృత్తమని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.జి. వేణు, ఎస్.విజయ్‌కుమార్, పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

తాటిముంజలకు భలే గిరాకీ

డజను రూ.50 నుంచి రూ.60



డీఆర్‌ఎం కార్యాలయం వద్ద తాటిముంజలు అమ్ముతున్న గీత కార్మికులు

అల్లిపురం : వేసవి వచ్చిందంటే చాలు.. అందరికీ గుర్తుకు వచ్చేవి తాటికాయలు. నగరంలో తాటికాయలు దొరకడం కష్టం కావడంతో నగర శివార్లు అయిన ఆనందపురం, తగరపువలస, పెందుర్తి, చింతల అగ్రహారం, కొత్తవలస తదితర ప్రాంతాల నుంచి గీత కార్మికులు తీసుకొచ్చే తాటిముంజలకు జనం ఎగబడుతున్నారు. దొండపర్తి డీఆర్‌ఎం కార్యాలయం రోడ్డులో తాటిముంజల వ్యాపారులు వాటిని విక్రయిస్తున్నారు. డజను రూ.50 నుంచి రూ.60 వరకు వీటి ధర పలుకుతోంది. వేసవి వేడికి తాటిముంజలు ఉపశమనం కావడంతో జనం వాటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ఆధ్యాత్మిక భావాలు అలవరచుకోవాలి



ప్రసంగిస్తున్న సుందర్ గోపాల్ ప్రభు

కొమ్మాది : నేటి తరం యువత ఆధ్యాత్మిక భావాలు అలవరచుకోవాలని సుందర్ గోపాల్ ప్రభు సూచించారు. భీమిలి బీచ్ రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో రెండో రోజు నిర్వహించిన ఇస్కాన్ ఇండియా యూత్ కౌన్సిల్ (ఐఐవైసీ) సమావేశంలో బుధవారం ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందికి సనాతన ధర్మాన్ని బోధించే కార్యక్రమంలో భాగంగా ఈ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆధ్యాత్మిక భావాలు మనిషిని కష్ట సుఖాల్లో నిలబెడతాయని, మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఇస్కాన్ ఆలయంలో గల శ్రీ రాధాకృష్ణులకు, జగన్నాథ, సుభద్ర, బలభద్ర స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భాగవత ప్రవచనాలు ఉదయం 4.30 గంటల నుంచి ప్రత్యేక హారతి కార్యక్రమాలు, నగర సంకీర్తన నిర్వహించారు. సమావేశాల్లో స్వామీజీ పరివ్రాజిక స్వామి మహారాజ్, రాధే శ్యామ్ ప్రభు, సాగర్‌నగర్ ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

పీఎం పాలెం : ప్రమాదానికి గురైన భవన నిర్మాణ కార్మికుడు చికిత్స పొందుతూ మరణించాడు. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధురవాడ శ్రీనివాస నగర్‌లో కుటుంబంతో నివసిస్తున్న నందిగ చిన్న (27) భవన నిర్మాణ కార్మికుడు. ఈ నెల 4న జీవీఎంసీ 5వ వార్డులోని శివశక్తినగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనంలో రాడ్ బెండింగ్ పనులకు వెళ్లాడు. అక్కడ పని చేస్తుండగా రెండో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తూ కిందకు పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. మృతుని భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.